# స్వయంవరం

పచ్చిపాలలోంచి వెన్ననే కాదు, అమృతాన్నే సాధించవచ్చని ఆనాడే గ్రహించారు దేవదానవులు, క్షీరసాగర మథనం జోరుగా సాగుతోంది.

పాల సముద్రం క్రిందున్న ముత్యాలు, రత్నాలు, వజ్రాలు, ఓషధులు, లోహాలు, జీవాలు, ఎయే పదార్థాలు ఏ ప్రమాణంలో వేటితో ఏవేవి కలుసుకుంటున్నాయో? ఏయే కొత్త కొత్త ఆకారాలు ధరిస్తున్నాయో!!

సురభి అనే తెల్లని ఆవు కుండెడు పొదుగుతో పాల సముద్రం నుంచి బయటకొచ్చింది. వెంటనే దేవమునులందరూ "అబ్బాయ్! అమృతం కోసం మీ తంటాలేవో మీరు పడండి. సురభి మాకు కావాలి. ఇది ఇచ్చే పాలే మాకు అమృతం" అని ఆ కామధేనువును తీసేసుకున్నారు.

పాలలో బంగారం కలిసినట్టున్న శరీర కాంతితో వెలిగిపోతున్న ఓ గుర్రం బయటికి దూకింది. అంతకన్నా వేగంగా దానికేసి దూకి, "ఈ ఉచ్ఛైశ్రవం నాది" అన్నాడు దానవరాజు బలి.

మద గజానికి మల్లే ఒక తెల్లని మదగజం నాలుగు దంతాలతో కులుకుతూ బయటపడింది. తెల్లఏనుగుని భరించేవాడెవడు? ఉన్నాడుగా. త్రిలోకనాధుడు, ఇంద్రుడు ఆయన తీసుకున్నాడు.

కంచు కాండంతో, పాదరసపు కొమ్మల్తో, వెండి ఆకుల్తో బంగారపు పువ్వుల్తో "కల్పవృక్షం" కనపడింది. "ఇది నందన వనానికి ప్రత్యేకాకర్షణగా బాగుంటుంది. అని ఇంద్రుడు దాన్ని స్వర్గానికి పట్టించాడు.

"సరే పట్టుకెళ్ళనీ! రేపు దీనికే అంట్లు తొక్కుదాం" అని ఊరుకున్నారు దానవులు.

ఇంతలో కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. రంభ, మేనక, మృతాచి, పుంజికస్థల, కృతస్థల, మంజూఘోష, సహజన్య, ప్రమ్లోచ, అనుమ్లోచ, విశ్వాసి, పూర్వచిత్తి, పాదాసూత, మహాభాగ, దేవర్షిత, అలంబుష, విద్యుత్పర్ణ, అరుణ, రక్షిత, మనోరమ, మిశ్రకేశి, కేశిని, సుకేశి, సుబాహువు, సురత, సురజ మొదలైన అప్సరస లనేకమంది ఆవిర్భవించారు. జున్ను ముక్కల్లాంటి వాళ్ళని చూస్తూనే దేవేంద్రుడు "ఇక్కడ ఎండ మండిపోతుంది. పొండి, పొండి, పోయి ఆ కల్పవృక్షం నీడలో విశ్రాంతి తీసుకోండి" అని వాళ్ళను స్వర్గానికి తోలేశాడు. దానవులు నోరు తెరిచే లోపలే వాళ్ళు కోకిలులాగా కిలకిలలాడుతూ వెళ్ళిపోయారు.

దానవులు ఆలోచించసాగారు. 'ఏనుగును వదిలేసిన అలుసు చూసుకుని వచ్చిన ప్రతిదానిని అన్నగారు లాగించేస్తున్నాడు. ఏం చెయ్యాలి?' ఇంతలో చల్లగా చంద్రుడూడి పడ్డాడు. దేవతల్లో కలిసిపోయాడు.

దానవులిలా అన్నారు. "అన్నా! ఇంద్రా! అమృతం సంగతటుంచు. ఈ లోపల వచ్చిందాన్ని వచ్చినట్టుగా స్వర్గానికే పట్టించేస్తున్నావు. ఇది బాలేదు" అన్నారు.

"ఉచ్ఛైశ్రవాన్ని బలి తీసుకున్నాడుగా" అన్నాడు ఇంద్రుడు

"ఆపైన అన్నీ నువ్వే తీసుకున్నావుగా వరసగా అన్నారు దానవులు

"అయితే ఈసారి ఎవ్వరం మాట్లాడొద్దు. ఆ వచ్చింది ఎవర్ని వరిస్తే వాళ్ళది" అన్నాడింద్రుడు. అందరూ సరేనంటే సరే అన్నారు.

మథనం మళ్ళీ మొదలైంది.

పాలమీగడలాంటి దేహం, నీలాల్లాటి కురులు, మీనాల్లాంటి కనులు, ముత్యాల్లాంటి పలువరుస, శంఖం లాంటి మెడ, పగడాల్లాంటి పాదాలు, వజ్రాల్లాటి పాలిండ్లు, పాలకడలి గారాలపట్టి శ్రీమహాలక్ష్మి ఆవిర్భవించింది. ఆమె కళ్ళు నిలిచినచోట నిలువకుండా చక్రాల్లాగా పరిభ్రమించసాగాయి. చంచలమైన ఆ కళ్ళు చూసి, కళ్ళున్న ప్రతివాడూ అచంచలుడై పోయాడు.

"నారాయణ" అంటూ ముందుకొచ్చాడు నారదమహర్షి! అమ్మా క్షీరసముద్ర రాజ తనయా! ఇక్కడ దేవదానవ శ్రేష్ఠులనేకమంది ఉన్నారు. వీరిలో నీ ఇచ్చవాచ్చినవారిని అనుగ్రహించు తల్లీ! ఈయన దానవరాజు బలి" అన్నాడు

ఆమె చూపు వేరే వైపు మళ్ళింది.



"ఈయన వాసుకి! సర్పరాజు"

లక్ష్మి రెండు కళ్ళూ మూడో కన్ను వాడి వైపు తిరిగాయి.

ఈయన పరమశివుడు. భస్మచారి" అన్నాడు నారదుడు

"బూడిదని అన్నపూర్ణకే వదిలేస్తాను నాకొద్దు" అంది లక్ష్మి

"ఈయన దేవేంద్రుడు అప్సరోహృదయ నాథుడు".

"ఇతరుల నాథుడు నాకొద్దు"

"ఈయన చతుర్ముఖ బ్రహ్మ! సుర జ్యేష్ఠుడు, పితామహుడు.

"పితామహుడా? అంత వృద్ధుడు నాకెందుకయ్యా?' నవ్వింది కమల.

"ఈయన శ్రీ మహావిష్ణువు, పురుషోత్తముడు" నమస్కరించాడు నారదుడు

"పురుషోత్తముడి కోసమే నే నెదురు చూస్తున్నాను!" అని కౌస్తుభాన్ని తీసుకుని ముకుందుని వెంట వైకుంఠానికి వెళ్ళింది హేమమాలిని.

బ్రహ్మ ఆశ్చర్యపోయాడు. "ఆహా! పురుషోత్తముడనంగానే ఎగిరి గంతేశావు గాని, ఆయన నాకన్నా పూర్వుడు తల్లీ! నాతండ్రీ! నేను పితామహుడ నైతే ఆయన ప్రపితామహుడు. నీ భాగ్యమేమని చెప్పను"!

తాతని స్మరిస్తూ తండ్రిని నమస్కరిస్తున్న నారదుడి మీద పూల వాన కురిపిద్దామని దేవతలు చేతులు చాచారు. కాని వాళ్ళ చేతుల్లోకి ఒక్కపువ్వూ రాలేదు. అన్నీ లక్ష్మి కలంకరించి వైకుంఠానికి పంపేశాడు గదా నారదుడు!!